ఎంఎస్ఎంఈడీ చట్టాన్ని అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎర్రతోట రాజశేఖర్, నిరుడు రాజు, అద్దుల లక్ష్మణ్

కవాడిగూడ: మైక్రో స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజస్ డెవలప్ మెంట్ చట్టం (ఎంఎస్ఎంఈడీ) 2006 సంవత్సరంలో అప్పటి కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం దళిత ఆదివాసీ పారిశ్రామికుల ప్రోత్సాహం కోసం వారికి రాయితీలు, సడలింపులు కల్పిస్తూ ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చిందని, క్షేత్రస్థాయిలో ఆ చట్టం అన్ని రాష్ట్రాలలో అమలు కానందువల్ల అది నీరుగారిపోయిందని భరత దళిత పరిశ్రమల సమాఖ్య జాతీయ కౌన్సిల్ చైర్మన్ ఎర్రతోట రాజశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం దోమలగూడలోని భారతీయ దళిత పరిశ్రమల సమాఖ్య జాతీయ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ కౌన్సిల్ చైర్మన్ ఎర్రతోట రాజశేఖర్, తెలంగాణ రాష్ట్ర చాప్టర్ అధ్యక్షుడు నిరుడు రాజు, తెలంగాణ చీఫ్ మెంటర్ అద్దుల లక్ష్మణ్‌తో కలిసి మాట్లాడుతూ... తెలంగాణలో పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం దళిత పారిశ్రామిక వేత్తలకు రావల్సిన రాయితీలు కల్పించకుండా ఇతర డిపార్టుమెంట్లకు ఆ నిధులను మళ్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వీస్ ప్రొక్యూర్‌మెంట్ కాంట్రాక్టుల్లో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామక వేత్తలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడానికి తెలంగాణ పరిశ్రమల శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమశాఖ, నీటి పారుదల ప్రధాన కార్యదర్శులకు వినతి పత్రాలను అందజేసినా ఉపయోగం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు చేవెళ్లలో నిర్వహించిన ఎస్సీ,ఎస్టీ, డిక్లరేషన్ సభకు కట్టుబడి ఉండి ఎంఎస్ఎంఈడీ 2006 చట్టం అమలు చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయండి

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని స్వాగతిస్తున్నాం
- పీవోడబ్ల్యూ నేతల స్పష్టీకరణ



మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ రాష్ట్ర నేతలు

కవాడిగూడ: ఈ నెల 16వ తేదీ జరిగే గ్రామీణ బంధు, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని పీవోడబ్ల్యూ నేతలు పిలుపునిచ్చారు. శనివారం ప్రగతిశీల మహిళాసంఘం (పీవోడబ్ల్యూ) తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ఫిబ్రవరి 2, 3 తేదీలలో విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల అనంతర పరిణామాలను చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఝాన్సీ, మంగ మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్సు సౌకర్యం వల్ల దూరప్రాంతాలలో పనిచేసే మహిళలకు రవాణా భారం తగ్గిందని దీనిని స్వాగతిస్తున్నాం అన్నారు. ఆ మొత్తాన్ని ఆహారంపై వెచ్చించడం వల్ల కుటుంబంలో కొంత మెరుగైన ఆహార లభ్యత పేద కుటుంబాలకు దొరుకుతుందన్నారు. మహిళలకు ఇస్తామన్న ఇతర పథకాలను వీలైనంత తొందరగా అమలు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం మరింత మహిళా ధరణ పొందుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఎస్‌కెఎం, సెంట్రల్ ట్రేడ్ యూనియన్స్ ఫిబ్రవరి 16వ తారీకున ఇచ్చిన గ్రామీణ బంధు, పారిశ్రామిక సమ్మెకు ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర కార్యవర్గం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. రాష్ట్ర మహిళా కమిషన్‌లో వందలాది కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం మహిళా కమిషన్ చైర్మన్‌ను నియమించి సత్వరంగా కేసులను విచారించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతి, కార్యదర్శి ఆర్.సీత, కోశాధికారి గీత, కార్యవర్గ సభ్యులు జానకి, కావేరి, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికంగా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



స్నాతకోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

కాచిగూడ: ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులు నూతన శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ టీఎల్ఎన్ స్వామి అన్నారు. బర్కత్‌పురాలోని అవంతి కళాశాల ఎంసీఏ, ఎంబీఏ విద్యార్థుల స్నాతకోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చదువుకున్న విద్యాలయం, మాతృదేశంతో పాటు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చేలా ఎదగాలని సూచించారు. ఎంబీఏ, ఎంసీఏ పూర్తి చేసుకున్న విద్యార్థులకు డిగ్రీ పట్టాలు, గోల్డ్ మెడల్స్, జ్ఞాపికలను అందజేశారు. ప్రతి విద్యార్థి ఉన్నతస్థాయికి చేరుకోవాలంటే ఆశయం, సామర్థ్యం, అంకితభావం, క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం, నిబద్ధత ఉండాలని అన్నారు. ఓయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ జహంగీర్, అవంతి విద్యా సంస్థల ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రియాంక, డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, డాక్టర్ రేణుక, నవీన్ చంద్ర, మోహన్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



కూల్చివేతలను పరిశీలిస్తున్న డీఎంసీ యాదయ్య, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రమేష్

కవాడిగూడ: అడిక్‌మెట్ డివిజన్ రాంనగర్‌లో చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని జీహెచ్ఎంసీ సర్కిల్–15 టౌన్‌ప్లానింగ్ అధికారులు శనివారం కూల్చివేశారు. కోర్టు ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు పోలీసు బందోబస్తు నడుమ అక్రమంగా నిర్మించిన రెండు అదనపు అంతస్తులను కూల్చివేశారు. రాంనగర్ రిథమ్ బార్ వీధిలో ఇంటి నెంబర్ 1–9–19/148లో ఓ నిర్మాణదారుడు రెండు అంతస్తులకు అనుమతి తీసుకొని అదనంగా మరో రెండు అంతస్తుల మేర నిర్మాణం చేపడుతున్నారు. స్థానికులు కోర్టులో ఫిర్యాదు చేయడంతో అధికారులు కోర్టు ఆదేశాల మేరకు కూల్చివేశారు. ఈ సందర్భంగా నిర్మాణ దారులకు టౌన్‌ప్లానింగ్ అధికారులు పోలీసులకు మధ్య వాగ్వాదం, స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. తమకు నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారని నిర్మాణ దారులు అధికారులతో వాదనకు దిగగా కోర్టు ఆదేశాల మేరకు కూల్చివేతలు చేపట్టినట్లు ముషీరాబాద్ టౌన్ ప్లానింగ్ అధికారి రమేష్ తెలిపారు. డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య కూల్చివేతలను పరిశీలించారు.

నరేంద్ర పార్కును సందర్శించిన ఎమ్మెల్యే



నరేంద్ర పార్కులో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమైన ఎమ్మెల్యే కాలేరు

నల్లకుంట: న్యూనల్లకుంటలోని నరేంద్ర పార్కును శనివారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులో జరుగున్న అభివృద్ధి, సుందరీకరణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనుల పురోగతిపై జీహెచ్ఎంసీ అధికారులతో ఆరాతీశారు. పార్కులో సుందరీకరణ పనులు 60 శాతం పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. సుందరీకరణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత సమయంలో పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కాలనీ అసోసియేషన్ సభ్యులతో సమావేశమైన ఎమ్మెల్యే పార్కు సుందరీకరణపై ముచ్చటించారు. కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ్ కుమార్, ఏఈ దివ్య, యూబీడీ ఏఈ భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు ఎ. రమణానాయుడు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీనియర్ అడ్వకేట్ రాంచందర్‌రావు

కాచిగూడ: న్యాయ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీనియర్ అడ్వకేట్ నారపరాజు రాంచందర్‌రావు సూచించారు. ప్రకాశం ఇనిస్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్, మర్యాడి శిక్షా సమితి న్యాయ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కాచిగూడ లోని కళాశాలలో 'కేంద్ర, రాష్ట్ర సంబంధాలు–రాజ్యాంగ దృష్టి కోణం' అనే అంశంపై ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. సామాన్యులకు చట్టాలపై అవగాహన పెంచేందుకు కృషి చేయాలన్నారు. చట్టాలపై అవగాహన లేకపోతే జరిగే నష్టాలను ఎవరూ పూడ్చలేరన్నారు. భారత్‌లో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేంది న్యాయవ్యవస్థేనని అన్నారు. భావి పౌరులైన విద్యార్థులు ప్రభుత్వ న్యాయ చట్టాలపైన, దేశ పౌరుల మౌలిక హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించుకోవాలని అన్నారు. ప్రకాశం ఇనిస్టిట్యూట్ వైస్ ప్రెసిడెంట్ పి.మోహన్‌రావు, కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ డివిజి కృష్ణ, టంగుటూరి శ్రీరామ్, రామచంద్రమూర్తి, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దువ్వూరి వి.ఎస్.ప్రదీప్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం

పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు 9 సీట్లు కేటాయించాలి



బీసీ సంఘాల నేతలతో కలిసి అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం జరిగిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన శనివారం కాచిగూడలో జరిగిన సమావేశంలో ఆయన మట్లాడుతూ... మొత్తం 47 కోట్ల 65 లక్షల 768 కోట్లు కేంద్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి భిక్షం ఇచ్చినట్లుగా కేవలం రూ. 2150 కోట్లు బడ్జెట్ మాత్రమే కేటాయించి బీజేపీ ప్రభుత్వం బీసీలను విస్మరించిందన్నారు. బడ్జెట్‌లో బీసీలకు కేటాయించిన మొత్తం చూస్తే, దేశంలో 75 కోట్ల మంది బీసీలకు పంచితే చాక్లెట్లు, బిస్కెట్లు కూడా రావని అన్నారు. బీసీ విద్యా, ఉద్యోగ, ఆర్థికాభివృద్ధి లాంటి స్కీములకు కేటాయింపులు లేవని అన్నారు. జాతీయ బీసీ కార్పొరేషన్‌కు బడ్జెట్ కేటాయించకుండా నిర్వీర్యం చేశారని విమర్శించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో బీసీలకు బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు 9 సీట్లు ఇవ్వాలని ఆర్.కృష్ణయ్య ఆయా పార్టీల అధ్యక్షులను డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బీసీలకు చాలా తక్కువ సీట్లు ఇచ్చారని, అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీల మధ్య హోరాహోరీ పోరు ఉన్నందున గెలుపు గుర్రాలు, ఆర్థిక బలం అంటూ బీసీ అభ్యర్థులకు అన్యాయం చేశారని అన్నారు. బీసీలకు సీట్లు ఇస్తే గెలిపించుకుంటామని, బీసీలను విస్మరించే పార్టీలకు గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు. బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గువ్వల భరత్, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, కోట్ల శ్రీనివాస్ నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, టి.రాజ్‌కుమార్, నందగోపాల్ భీరప్ప, ఉదయ్‌నేత, కృష్ణమూర్తి, అరవింద్, నిమ్మల వీరప్ప, జయంతి, భాగ్యలక్ష్మీ, జ్యోతి, రాకేష్, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

కొరవడిన సామాజిక న్యాయం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కేంద్రం బడ్జెట్‌లో సామాజిక న్యాయం కొరవడిందని తెలంగాణ దళిత బహుజన శ్రామిక యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.నర్సింహ విమర్శించారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దళిత బహుజన శ్రామిక యూనియన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ... సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ అనే ప్రధాని నరేంద్రమోదీ పిలుపును ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌ను పరిశీలిస్తే సమానత్వ సాధన, పేదరిక నిర్మూలనకు ప్రత్యేకమైన చర్యలు ఏమీ లేవని అన్నారు. దళిత, గిరిజనులకు సంక్షేమ పథకాలను అమలు చేయటంలో విఫలం చెందారని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సి.ఆనంద్, సీఎంసీ కన్వీనర్ శివలింగం, డిబిఎఫ్ జాతీయ కన్వీనర్ పి.శంకర్, నాయకులు జె.రమేష్, చిన్నయ్య, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నర్సింహా

షబ్బీర్ అలీకి సత్కారం



చిక్కడపల్లి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ సలహాదారుడిగా నియమితులైన మాజీ మంత్రి షబ్బీర్ అలీ శనివారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాక జ్ఞానేశ్వరి రవిప్రసాద్ సచివాలయంలో ఆయను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

బైస దేవదాసుకు 'తెలుగు భాషారత్న' పురస్కారం

చిక్కడపల్లి: ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ నేటి నిజం దిన పత్రిక సంపాదకులు బైస దేవదాసును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికార భాషా సంఘం తెలుగు భాషారత్న జీవన సాఫల్య పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ మేరకు సంఘం చైర్మన్ విజయబాబు అధికారిక ప్రకటనను విడుదల చేస్తూ భాషకు, సాహిత్యానికి సుదీర్ఘ కాలంగా చేస్తున్న కృషికి గుర్తింపుగా ఎంపిక చేశామన్నారు. ఈ నెల 5న నాగార్జున సాగర్ వద్ద నున్న నాగార్జున విశ్వవిద్యాలయంలోని జరిగే వేడుకల్లో పురస్కారాన్ని బహూకరిస్తామని తెలిపారు.

విదేశాల్లో విద్యావకాశాలపై అవగాహన

బంజారాహిల్స్: విదేశాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లోని కోర్సులు, విద్యావకాశాలు, పలు ఎంట్రెన్స్ టెస్టులలో చేయాల్సిన స్కోర్స్‌లాంటి వాటి గురించి విద్యార్థులు వారి తల్లిదండ్రులు తెలుసుకొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. శనివారం బంజారాహిల్స్‌లోని తాజ్‌డెక్కన్‌లో ఐవీవై ఓవర్సీస్ ఆధ్వర్యంలో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్–2024 పేరిట ఉచిత అవగాహన సదస్సును నిర్వహించారు. సుమారు 1000 మంది విద్యార్థులతో పాటు ఆయా యూనివర్సిటీల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ప్రముఖ దేశాలైన యూఎస్ఏ, ఆస్ట్రేలియా, యూకే, కెనెడా, న్యూజిలెండ్, ఐర్లాండ్ వంటి దేశాల్లో విద్యావకాశాలు, ఆయా యూనివర్సిటీల స్థితిగతుల గురించి విద్యార్థులు అడిగి తెలుసుకొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఇలాంటి అవగాహనా సదస్సుల ద్వారా విద్యార్థులకు విదేశాల్లో ఉన్నత విద్యావకాశాలను గురించి తెలుసుకోవడానికి చాలా ఉపయుక్తంగా ఉంటుందని ఐవీవై ఎండీలు గిరి శ్రీనివాసరావు బొంగరాల, రామ్ బొంగరాల తెలిపారు. కార్యక్రమంలో సేల్స్ హెడ్ శివశంకర్, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆటపాటలతో అలరించిన చిన్నారులు



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బుడిబుడి నడకలతో చిన్నారులు చేసిన నృత్యాలు ఎంతగానో అలరించాయి. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టైమ్ కిడ్స్ నల్లకుంట 14వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులు ఆధునిక, సంప్రదాయ నృత్యాలతో అదరోహో అనిపించారు.కూచిపూడి, భరత నాట్యాలతో పాటు ఫోక్ సాంగ్స్‌పై డ్యాన్స్ చేసి శభాష్ అనిపించారు. ఈ సందర్భంగా నల్లకుంట సెంటర్ హెడ్ శ్రీదేవి మాట్లాడుతూ... చిన్నారులు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

ఘనంగా జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న ఫీవర్ సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ జయలక్ష్మి

నల్లకుంట: తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎంహెచ్ఈయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్ ఆధ్వర్యంలో శనివారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో జాతీయ మహిళా వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ జయలక్ష్మి, మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ శైలజ, డాక్టర్ హరిత, డాక్టర్ సౌజన్యలను శాలువాతో సన్మానించారు. అనంతరం ఆర్ఎంవో, మహిళా వైద్యులతో కేక్ కట్ చేయించిన యూనియన్ నాయకులు మహిళా వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి డీసీహెచ్ ఆర్ఎంవో డాక్టర్ చంద్ర శేఖర్, టీఎంహెచ్ఈయూ ఫీవర్ శాఖ అధ్యక్షురాలు కె.లావణ్య, ఉపాధ్యక్షురాలు పి.పద్మజ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతా



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి పరిచి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం కాచిగూడ డివిజన్ లింగంపల్లి గణేష్ టెంపుల్ వద్ద రూ. 16 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సరఫరా, పార్కుల ఏర్పాటు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. జనాభా అవసరాలకు అనగుణంగా మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఆధునీకరించి ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి, సివరేజ్ సమస్యల పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, బీజేపీ నేతలు సుభాష్ పటేల్, బి.భీమ్‌రాజ్, ఎస్.రవి యాదవ్, మల్లికార్జున్, జలమండలి డీజీఎం సన్యాసిరావు, ఏఈ భావన, వెంకటేష్ యాదవ్, జీహెచ్ఎంసీ ఏఈ సబిత, లావణ్య, కళావతి, తార తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానందనగర్ బస్తీవాసుల నిరసన దీక్ష



నిరసన దీక్షలో పాల్గొన్న నేతలు

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని శ్రీ స్వామి వివేకానందనగర్ బస్తీవాసుల ఇళ్ల కూల్చివేతలను నిరసిస్తూ శనివారం బస్తీవాసులు చేపట్టిన నిరసన దీక్షా కార్యక్రమానికి దళిత సంఘాల ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి, బీజేపీ ఓబీసీ సెల్ జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు, గాంధీనగర్, కవాడిగూడ కార్పొరేటర్ ఎ.పావనీవినయకుమార్, రచనశ్రీ, బీజేవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయ కుమార్ తదితరులు దీక్షలో పాల్గొన్నారు. ఇళ్లు కోల్పోయి నిస్సహాయులుగా మిగిలిన నిరుపేద ప్రజలకు అండగా నిలుస్తామని, బాధితుల డిమాండ్లను పరిశీలించి, ప్రభుత్వ సహాయంతో అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో బీజేపీ నేతలు జి.వెంకటేశ్, శ్రీకాంత్, ఉమేశ్, మహమూద్, లక్ష్మీనారాయణ, సాయికుమార్, దోనేటి సత్యం, సురేశ్ తదితరులు పాల్గొన్నారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఆందోళన విరమించే ప్రశ్నేలేని స్పష్టం చేశారు.

డీబీఎఫ్ మద్దతు

వివేకానందనగర్ బస్తీవాసుల ఆందోళనకు దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ నేతృత్వంలో దీక్ష చేపట్టిన ప్రాంతాన్ని సందర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, నవీన్ పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు



ప్రవచిస్తున్న డాక్టర్ అనంతలక్ష్మి

నల్లకుంట: శ్రీరామ గాన సభ ఆధ్వర్యంలో న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి ఆలయ ప్రాంగణంలో శనివారం త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన సౌత్ సెంట్రల్ రైల్వే విశ్రాంత జీఎం చేబియ్యం రామ కృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ముందుగా ప్రముఖ ప్రవచకారులు డాక్టర్ అనంత లక్ష్మి అయోధ్య రాముడిపై ఇచ్చిన ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అఖిలా శంకర్‌నాథ్‌చే వీణా గానం, శ్రీరామగాన సభ నాదోపాసన బృందంచే నిర్వహించిన దివ్య నామ సంకీర్తనలు ఆహూతులను అలరించాయి. దీనికి మృదంగంపై విద్యాసాగర్, ఘటంపై శ్రీధర్‌చిరి వాద్య సహకారమందించారు. మహోత్సవాల్లో రెండో రోజైన ఆదివారం సాయంత్రం కశ్యపి సంగీత అకాడమీ విద్యార్థులు, ప్రముఖ సంగీత విద్వాంసుడు కె.శ్యామ్ కుమార్‌లచే గానం ఉంటుందని శ్రీ రామగాన సభ్య కార్యదర్శి కొణికి శ్రీనివాసశర్మ తెలిపారు.

5న తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర సదస్సు

కాచిగూడ: తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు జేఏసీ చైర్మన్ పాస్టర్ జిలకర రవికుమార్ తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి కొండ సురేఖ, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, డాక్టర్ మల్లు రవి, నల్ల రాధాకృష్ణ, డాక్టర్ నల్లూరి బాబురావు, కూచిపూడి బాబురావు ఐపీఎస్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

హనుమాన్ ఆలయ ధర్మకర్తల నియామకానికి నోటిఫికేషన్

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్ దోమలగూడలోని హనుమాన్ ఆలయ ధర్మకర్తల నియామకం కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆలయ ఈవో ఎన్.దేవనాథం తెలిపారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఆదేశాల మేరకు నూతన ధర్మకర్తల నియామకం కోసం నోటిఫికేషన్ వచ్చినందున శనివారం ఆలయంలో నోటీసు బోర్డుపై వివరాలను పొందుపరిచినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు ఈ నెల 3వ తేదీ నుంచి 24 రోజుల వరకు దేవాలయ ధర్మకర్తల అప్లికేషన్‌లు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఆర్టీసీ పీసీసీ ఏజెంట్స్ సమస్యలపై ఆందోళన

కవాడిగూడ: తెలంగాణ ఆర్టీసీ పీసీసీ ఏజెంట్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఆర్టీపీ ఏజెంట్స్ యూనియన్ అధ్యక్షుడు మునగాల కాంతారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చాలా కాలంగా తమ సమస్యలపై ఆర్టీసీ యాజమాన్యం, ఎండీకి వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేయడంతోపాటు అవసరమైతే నివరధిక బంధుకు పిలుపునిస్తామని ఆయన హెచ్చరించారు. శనివారం ఇందిరా పార్కు వద్ద యూనియన్ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షుడు కాంతారావు, కార్యదర్శి పారంద సాయి, ఆర్గనైజేషన్ సభ్యులు ఉప్పలయ్య, వంటెపాక నగేష్, శ్రీధర్, సాబేర్, సునీల్ మాట్లాడారు.

కల్లు దుకాణాలపై దాడులు ఆపాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: హైదరాబాద్‌లో కల్లు సొసైటీలపై ఉద్దేశపూర్వకంగా చేస్తున్న దాడులను వెంటనే ఆపాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణ గౌడ్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణగౌడ్ మాట్లాడుతూ... ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ వారికి హైదరాబాద్‌లో గల్లీ గల్లీలో జరుగుతున్న గంజాయి, డ్రగ్స్ దందాలు కనిపించటం లేదా అని ప్రశ్నించారు.కల్లు గీత వృత్తిదారులపైన, సొసైటీలపై ఆధారపడి జీవిస్తున్న గీత కార్మికులపైన ఎందుకు ఇంత అక్కసు అని విమర్శించారు. కల్తీ కల్లు పేరు చెప్పి వేలాది మంది ఆధారపడి జీవిస్తున్న కల్లు సొసైటీలపైన బురద చల్లటం సరైంది కాదన్నారు. నగరంలో ఆహార పదార్థాలతో పాటు పాలల్లో కల్తీ జరుతుగుంటే అవేవీ మీకు పట్టవా అని ప్రశ్నించారు. అనేక ప్రాంతాల నుంచి కూరగాయలు, పాలు రవాణా అవుతుంటే కేవలం కల్లుకు మాత్రమే ఎందుకు 50 కిలో మీటర్ల దూరం పరిమితి విధిస్తున్నారని ప్రశ్నించారు. కల్లుగీత వృత్తిపైన నిందలు వేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

వ్యవసాయ రంగ అధికారులకు ప్రమోషన్లు ఇవ్వాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ రంగ అధికారులకు ప్రమోషన్లు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం చైర్మన్ బి.కృపాకర్‌రెడ్డి, అధ్యక్షులు వైద్యనాథ్, ప్రధాన కార్యదర్శి జి.కృపాకర్‌రెడ్డి, కోశాధికారి రవీందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్‌లను చేపట్టి వ్యవసాయ అధికారులు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలన్నారు. ప్రమోషన్లకు అడ్డుగా ఉన్న జీవో నెంబర్ 16ను వెంటనే రద్దు చేసి సర్వీసుల నిబంధనల ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పలువురు వ్యవసాయ రంగ అధికారులు పాల్గొన్నారు.

బీసీల్లోని 17 కులాలను సెంట్రల్ ఓబీసీ జాబితాలో చేర్చాలి



డాక్టర్ కె.లక్ష్మణ్‌కు వినతి పత్రం ఐక్య వేదిక ప్రతినిధులు

నల్లకుంట: రాష్ట్రంలోని బీసీల్లోని 17 కులాలు అన్ని రంగాల్లో వెనుకబడ్డారని, ఆ కులాలను గుర్తించి కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని బీసీ 17 కులాల ఐక్య వేదిక కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి, సారోళ్ల సోమవంశ క్షత్రియ సంఘం రాష్ట్ర నాయకుడు బోరెడ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం శనివారం రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ... వివిధ 17 బీసీ కులాలకు గుర్తింపు లేని కారణంగా కొన్నేళ్లుగా వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలు పోటీ పరీక్షలు రాజేందుకు తీవ్ర సమస్య ఎదురవుతోందన్నారు. వీలైనంత త్వరగా తాము సూచించిన 17 బీసీ కులాలను సెంట్రల్ ఓబీసీ జాబితాలో చేర్చే ప్రక్రియ వేగవంతం చేయాలని డాక్టర్ లక్ష్మణ్‌కు విజ్ఞప్తి చేశామని, అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బైలకమ్మ మోహన్ చౌహాన్, ప్రధాన కార్యదర్శి కొంగల ప్రసాద్, ఉపాధ్యక్షుడు వెంకటరమణ, కోశాధికారి కైలాష్ పవార్, రాష్ట్ర నాయకులు ప్రమార్, జాజిరావు, వేదాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన వర్క్‌షాప్

బంజారాహిల్స్: బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ , రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ పాథాలజీ విభాగం ఆధ్వర్యంలో ఫ్లో సైటోమెట్రీ అంశంపై శనివారం ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పాథాలజీ, మైక్రోబయోలజిస్టులు తెలంగాణ చాప్టర్‌తో కలిసి నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో తెలుగు రాష్ట్రాల నుంచి 250 మంది వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ప్రస్తుతం వైద్య వృత్తిలో ఉన్నవారు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు వైద్య విద్యార్థులు కొత్త విషయాలను నేర్చుకునేందుకు అవకాశం కల్పించేలా వర్క్‌షాప్ కొనసాగింది. దేశంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన సీనియర్ వైద్య అధ్యాపకులు తమ అనుభవాలను వివరించారు. అంతేకాకుండా తాము స్వయంగా చూసిన అత్యంత అరుదైన, క్లిష్టమైన కేసులను వీరు ప్రత్యేకమైన కేస్ స్టడీస్ రూపంలో వివరించారు.